బలగం TV
BALAGAM
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 26 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డీజీఎంగా ఆశిష్ మెహ్రోత్రా బాధ్యతల స్వీకరణ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐ.ఆర్.ఎస్.ఈ.ఈ.) 1992 బ్యాచ్ అధికారి ఆశిష్ మెహ్రోత్రా బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో ఛార్జ్ తీసుకున్నారు. ఇంతకు ముందు ఆయన న్యూఢిల్లీలోని ఉత్తర రైల్వేలో చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ (సీ.ఈ.డీ.ఈ) గా బాధ్యతలను నిర్వర్తించారు. అలాగే ఆయన పాటియాలాలోని లోకోమోటివ్స్ వర్క్స్ ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా సేవలు అందించారు. ఇందులో ఆయన విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల నిర్వహణ రంగంలో గణనీయమైన కషి చేశారు. ఆశీష్ మెహ్రోత్రా 1995లో ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ మెడల్ (ఆర్.ఎస్.సీ), 2000లో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్స్ అవార్డు, 2006లో రైల్వే మంత్రి అవార్డు, 2023లో అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్ అందుకున్నారు.

# పంచాయతీ ఎన్నికలకు మోగిన నగరా




- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
- 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు
- తక్షణమే మోడల్ కోడ్ కండక్ట్ అమలు
- రేపటి నుంచి తొలి విడత నామినేషన్ల స్వీకరణ
- డిసెంబర్ 27న ముగియనున్న ఎన్నికల ప్రక్రియ
- 299 వార్డులు, 32 జీపీల్లో ఎన్నికలు వాయిదా
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు.మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని ఆమె తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. పోలింగ్ డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో జరుగనుంది. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని కమిషనర్ తెలిపారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే వచ్చినట్టు ఆమె పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) మంగళవారం నుంచే అమల్లోకి వచ్చిందని రాణి కుముదిని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు మొదటి సారి సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ అక్టోబర్ 9న షెడ్యూల్‌పై హైకోర్టు స్టే విధించినట్టు తెలిపారు. ప్రస్తుతం రెండవ సారి విడుదల చేస్తున్న నోటిఫికేషన్ ప్రక్రియ అమల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నోటా అమల్లో ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. బందోబస్తు, రవాణా తదితర కారణాల వల్ల మూడు దశల్లో ఎన్నికలనునిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రతి దశకు రెండు రోజుల వ్యవధి ఇచ్చామని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా నిర్వహిస్తు న్నందున వ్యవధి వల్ల మొదటి దశ ఎన్నికల ఫలితాలు తర్వాతి ఎన్నికల పై ఉండవని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలి పారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్ని కలకు డిసెంబర్ 3 నుంచి నామినేష న్లు స్వీకరించనున్నట్టు వివరించారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు,38,350 వార్డులకు,మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వ హించనున్నట్టు వెల్లడించారు.రాష్ట్రం లోని 299వార్డులు, 32 గ్రామ పంచాయతీల్లో కోర్టు కేసులు, ఇతర వివాదాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయని తెలిపారు. అందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25 గ్రామాలు, కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని 2 గ్రామాలు, ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలో 4 గ్రామాలు, పెనుబల్లి మండలంలో ఒక గ్రామం ఉన్నాయని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఆగిన పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు మిగితా 4వ పేజీలో

### రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల 2025 షెడ్యూల్ వివరాలు

| ఎన్నికల ప్రక్రియ | తొలి విడత | రెండో విడత | మూడో విడత |
|---|---|---|---|
| నామినేషన్ల స్వీకరణ | 27.11.25 | 30.11.25 | 03.12.25 |
| నామినేషన్ల స్వీకరణ చివరి రోజు | 29.11.25 | 02.12.25 | 05.12.25 |
| నామినేషన్ల పరిశీలన | 30.11.25 | 03.12.25 | 06.12.25 |
| నామినేషన్ల తిరస్కరణపై అప్పీల్ | 01.12.25 | 04.12.25 | 07.12.25 |
| అప్పీళ్ల పరిష్కరణకు చివరి తేది | 02.12.25 | 05.12.25 | 08.12.25 |
| నామినేషన్ల ఉపసంహరణ | 03.12.25 | 06.12.25 | 09.12.25 |
| అభ్యర్థుల తుది జాబితా విడుదల | 03.12.25 | 06.12.25 | 09.12.25 |
| పోలింగ్ తేదీ | 11.12.25 | 14.12.25 | 17.12.25 |
| కౌంటింగ్ | 11.12.25 | 14.12.25 | 17.12.25 |

# అయోధ్యలో ధర్మధ్వజం ఎగురవేత



- కాషాయ పతాకాన్ని ఎగురవేసిన ప్రధాని మోడీ
- భారతీయ సంస్కృతికి పునర్వికాసం
- ప్రధాని మోదీ

**బలగం టీవి, అయోధ్య**

అయోధ్యలోని రామాలయంలో ప్రధాని మోడీ మంగళవారం కాషాయ పతాకం - ధర్మ ధ్వజాన్ని ఎగురవేశారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు గుర్తుగా ఈ పతాకా విష్కరణ జరిగింది. పది అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవు వున్న త్రిభుజాకారపు కాషాయ పతాకాన్ని మోడీ ఆవిష్కరించారు. ఈ జెండాపై సూర్యుడు, ఓం, కోవిదార చెట్టు చిత్రాలు వున్నాయి. ఈ ధ్వజారోహణ కార్య క్రమంలో ప్రధాని మోడీతో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు పాల్గొన్నారు.

అనంతరం మోడీ అక్కడున్నవారిని ఉద్దేశించి ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ, రామభక్తుల సంకల్పం నేడు సాకారమైందని పేర్కొన్నారు.ఈనాడు భారతదేశ సాంస్కృతిక చైతన్యంలో మరో మలుపును ఈ నగరం వీక్షిస్తోంది. రామ జన్మభూమి ఆలయ శిఖరానికి జరిపే ఈ కీలకమైన ధ్వజారోహణ ఘట్టం విశిష్టమైనది, ప్రత్యేకమైనదని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. రామరాజ్యం విలువలు కాలాతీతమైనవని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వేలాదిమంది భక్తులు ఉదయం నుండే అయోధ్యకు పోటెత్తారు. జై శ్రీరామ్ నినాదాలు నగరమంతా ప్రతిధ్వనించాయి. ప్రధాని పర్యటనను పురస్కరించుకుని నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 7వేలమంది బలగాలను నగరంలో మోహరించారు.

ఎగురవేసిన ధర్మధ్వజం కేవలం జెండా మాత్రమే కాకుండా భారతీయ సాంస్కృతిక పునర్వికాసానికి చిహ్నమని అన్నారు. శతాబ్దాల పాటు భారత సమాజంపై మిగిలి ఉన్న గాయాలు, బాధలు ఈ రోజు నయం అయ్యాయని, 500 ఏళ్ల నాటి తీర్మానం నెరవేరిందని ప్రధాని స్పష్టం చేశారు. రామరాజ్య వైభవాన్ని ఈ ధర్మధ్వజం ప్రతిబింబిస్తుందన్నారు. ధర్మధ్వజంపై ఉన్న కోవిదార్ వృక్షం మన భారతీయ ఇతిహాసాల వైభవానికి చిహ్నమని పేర్కొన్నారు. "సత్యంపై అసత్యానికి చివరికి విజయం సాధిస్తుందన్న సందేశాన్ని ఈ పవిత్ర జెండా ప్రపంచానికి అందిస్తుంది" అని మోదీ అన్నారు.

రామాలయ నిర్మాణ యజ్ఞం నేడు పూర్ణాహుతి సాధించిందని ప్రధాని పేర్కొన్నారు. ఎక్కడి నుంచి చూసినా ధర్మధ్వజాన్ని దర్శించడం రాముడిని దర్శించినంత పుణ్యం అందిస్తుందని చెప్పారు. కోట్లాది రామభక్తుల కల నేడు నెరవేరినదని, రామమందిర నిర్మాణం కోసం సాయం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రధాని అభినందనలు తెలిపారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. దేశంలో ఇంకా బానిస భావజాలం కలిగినవారు ఉన్నారని, అలాంటి వారికి మన వ్యవస్థలో స్థానం ఇవ్వకూడదని ప్రధాని పేర్కొన్నారు. "రాముడు కాల్పనిక వ్యక్తి అని చెప్పే బానిస భావజాలం మన పురాతన సంస్కృతిని అవమానపరుస్తుంది. భారతీయ ప్రజాస్వామ్యానికి వేల ఏళ్ల చరిత్ర ఉంది. ఉత్తర మేరూర్ శాసనాలు దీనికి సాక్ష్యం" అని మోదీ అన్నారు. రాముడు కులం చూడడని, భక్తిని మాత్రమే చూడతాడని చెప్పారు. క్షమాగుణం కన్నా గొప్ప గుణం మరొకటి లేదని ప్రధాని వ్యాఖ్యానించారు.

ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, అయోధ్యలో జరిగిన ధర్మధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభమని అన్నారు. రామభక్తులందరికీ ఇవాళ అత్యంత పావనమైన రోజు అని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణంతో అయోధ్య అనుసంధానం మరింత బలపడిందని తెలిపారు. అయోధ్య నగరం విద్యుత్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రత్యేక సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని వివరించారు. "శ్రీరామ భగవాన్ భవ్య మందిరంపై ధ్వజారోహణం ఒక యజ్ఞ సమాప్తి మాత్రమే కాదు, ఒక కొత్త యుగానికి ప్రారంభం. ఈ చారిత్రాత్మక వేడుకను విజయం దిశగా నడిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రామభక్తుల తరపున అభినందనలు తెలియజేస్తున్నాను" అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ అగ్రవాల్‌కు తప్పిన ముప్పు



**బలగం టీవి, వేములవాడ**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్‌కు తృటిలో ముప్పు తప్పింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు, నాయకులు మంగళవారం పరిశీలించారు. వారు నిలబడిన ప్రాంతంలోనే బేస్‌మెంట్ కుంగిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభమైన 144 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. నిర్మాణ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతుండగా, తాజాగా ఆ పనులు పున్ణప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి పరిశీలనకు వెళ్లిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరీమ అగ్రవాల్ బేస్‌మెంట్‌పై నిలిచి ఉండగా.. అది ఒక్కసారిగా కిందకి కుంగడం కలకలం రేపింది. వెంటనే అధికారులు అప్రమత్తమై అందరినీ అక్కడి నుంచి పక్కకు పంపించారు. ఈ ఘటనతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ నాణ్యతపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు విలీనం



- కొత్త పరిశ్రమలకు క్యాప్టివ్ పవర్ పరిమితులు ఎత్తివేత
- పునరుత్పాదక ఇంధనానికి పెద్దపీట
- పలు అంశాలకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం
- వివరాలు వెల్లడించిన మంత్రి శ్రీధర్‌బాబు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) విస్తరణకు రాష్ట్ర కేబినెట్ మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సుదీర్ఘ కేబినెట్ భేటీ దాదాపు నాలుగు గంటలపాటు కొనసాగింది. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు మీడియాకు వివరాలు వెల్లడించారు.

రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు) సహా ఇతర స్కీంల ద్వారా సబ్సిడీలు పొందే కనెక్షన్ల నిర్వహణను ఇప్పుడున్న తెలంగాణ రాష్ట్ర ఉత్తర, దక్షిణ డిస్కంలే నిర్వహిస్తాయి. నూతనంగా ఏర్పడే సెంట్రల్ డిస్కం పరిధిలోకి వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లు వస్తాయని మంత్రివర్గం పేర్కొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోకి కోర్ అర్బన్ ఏరియాలో ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) ను ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల పెద్ద అంబర్‌పేట, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచా రం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, నిజాం పేట్, ఫిర్జాదీగూడ, జవహర్‌నగర్ మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీ లో విలీనం అవుతాయి. దీనికి అవసరమైన జీహెచ్ఎంసీ యాక్ట్, తెలంగాణ మున్సిపల్ యాక్ట్‌లకు సవరణలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్ సరఫరా, ఉత్పత్తి అంచనాలపై ఇంధనశాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రివర్గానికి వివరించారు. దీనిపై చర్చించి కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుదుత్పత్తి, మిగితా 4వ పేజీలో

## అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి బాలిక ఆత్మహత్య

- హైదరాబాద్ హబ్సిగూడలో ఘటన



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మార్కులు తక్కువ వచ్చాయనీ, తండ్రి మందలించడంతో ఓ బాలిక మనస్తాపంతో అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి హబ్సిగూడలో జరిగింది. ఓయూ ఎస్ఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడ కాకతీయనగర్‌కు చెందిన కె.సుకుమార్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆయన భార్య, కూతురు సిరివైష్ణవి(15), కుమారుడు వార్విన్‌రెడ్డితో కలిసి నివాసముంటున్నాడు. వైష్ణవి హబ్సిగూడ శ్రీచైతన్య స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఆమెకు గణితంలో తక్కువ మార్కులు వచ్చాయి. దాంతో తండ్రి ఆమెను మందలించి.. మంచి భవిష్యత్ కోసం కష్టపడి చదవాలని సూచించాడు. దాంతో తీవ్ర మనోవేదనకు, ఒత్తిడికి గురైన వైష్ణవి మంగళవారం తెల్లవారుజామున వారుండే అపార్ట్‌మెంట్ 4వ అంతస్తు టెర్రాస్ పైనుంచి కిందకు దూకింది. దాంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఇది గమనించిన ఆమె తండ్రి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




## టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

- భారత్-శ్రీలంకల్లో ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు మహా సమరం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్%-%2026కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం ముంబయిలో విడుదల చేసింది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు బరిలోకి దిగనున్నాయి. రౌండ్‌రాబిన్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో గ్రూప్, నాకౌట్ సహా మొత్తం 55 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌నకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు ఐసీసీ మంగళవారం ముంబైలో షెడ్యూల్‌ను ప్రకటించింది. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకూ జరుగబోయే ఈ మెగా టోర్నీకి భారత్‌లో ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, ముంబై ఆతిథ్యమివ్వనుండగా శ్రీలంకలో కొలంబో, క్యాండీలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. 20 జట్లు తలపడబోయే ఈ టోర్నీలో జట్లను 4 గ్రూపులుగా విభజించారు. రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించబోయే ఈ టోర్నీలో గ్రూప్, నాకౌట్‌తో కలిపి 55 మ్యాచ్‌లు జరుగుతాయి. గ్రూప్ దశలో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8 స్టేజ్‌కు అర్హత సాధిస్తాయి. ఈ దశలో 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. వాటిలో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు వెళ్తాయి. కాగా షెడ్యూల్ విడుదల సందర్భంగా భారత మాజీ సారథి రోహిత్ శర్మను ఐసీసీ.. ఈ టోర్నీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది.

ఫిబ్రవరి 7న కొలంబోలో పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌తో టోర్నీ ఆరంభం కానుంది. గ్రూప్ దశ ఫిబ్రవరి 20 దాకా సాగనుంది. 20 నుంచి మార్చి 01 వరకూ సూపర్-8 దశ జరుగనుండగా 4వ తేదీ నుంచి నాకౌట్ స్టేజ్ మొదలవుతుంది. తొలి సెమీస్ కోల్‌కతా (పాకిస్థాన్ క్వాలిఫై అయితే కొలంబోలో), రెండో సెమీస్ ముంబైలో జరుగుతుంది. మార్చి 8న అహ్మదాబాద్ (పాక్ అర్హత సాధిస్తే కొలంబోలో) ఫైనల్‌కు ఆతిథ్యమివ్వనుంది.ఆతిథ్య హక్కులు కల్గిన భారత జట్టు.. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఫిబ్రవరి 7న టైటిల్ వేటను ప్రారంభించనుంది. గ్రూప్-ఏలో ఉన్న టీమ్ఇండియా..తమ గ్రూపులోనే ఉన్న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఫిబ్రవరి 15న అమీతుమీ తేల్చుకోనుంది. దాయాదుల పోరు కొలంబోలో జరుగనుంది. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లన్నీ కొలంబోలోనే జరుగుతాయి.

# హిల్ట్ పాలసీ అవినీతి కోసం తెచ్చిందే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీ పూర్తిగా అవినీతి లక్ష్యంగానే రూపొందించబడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికే ఈ పాలసీని తెచ్చారని ఆరోపించారు.భూములను ఒకప్పుడు పరిశ్రమల కోసం కేటాయించిన ప్రభుత్వం ఇప్పుడు అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో 50-60 ఏళ్లుగా 21 పారిశ్రామి కవాడలు ఏర్పడ్డాయని, నగరం విస్తరించడంతో ఇవి మధ్యలోకి వచ్చాయని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ కాలంలో కూడా రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, కాలుష్యం లేని కంపెనీలకే అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు.

"ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం భూములను ధారాదత్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరులు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నారు" అని ఆరోపించారు. లక్షన్నర గజాల విలువనున్న భూమిని 10 వేల రూపాయలకే ఇచ్చే విధంగా పాలసీ రూపొందించారని అన్నారు. పారిశ్రామిక భూములను అమ్మి 4%-%5 లక్షల కోట్ల కుంభకోణం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ తీవ్రస్థాయిలో తప్పుపట్టారు."అంబానీ, అదానీలను ఒకే దెబ్బకు దాటేంత పెద్ద స్కామ్ స్కెచ్ వేశారు" అని వ్యాఖ్యానించారు.

# సీఎం మార్పు గందరగోళానికి ముగింపు పలకాలి



- కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకోవాలి
- కర్నాటక సీఎం సిద్ధరామయ్య

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పు గందరగోళానికి ముగింపు పలికే విధంగా కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఒక నిర్ణయం తీసుకోవాలని సిద్ధరామయ్య మంగళవారం వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మార్పు విషయంపై హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. శాసన సభ్యులు పార్టీ నాయకత్వాన్ని కలవడానికి, అభిప్రాయాలు పంచుకోవడానికి స్వేచ్ఛగా ఉన్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల ఢిల్లీ టూర్ గురించి విలేకరులు మంగళవారం అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానం ఇస్తూ 'వారిని వెళ్లనివ్వండి. ఎమ్మెల్యేలకు ఆ స్వేచ్ఛ ఉంది. వారు ఏ అభిప్రాయం పంచుకుంటారో చూద్దాం. చివరిగా హైకమాండ్ నిర్ణయం తీసుకోవాలి. హైకమాండ్ చెప్పిన దానికి మేం కట్టుబడి ఉంటాం' అని తెలిపారు. అలాగే, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అడిగిన ప్రశ్నకు 'హైకమాండ్ చెప్పినప్పుడే అది జరుగుతుంది' అని సమాధానం ఇచ్చారు. అలాగే, రాహుల్‌గాంధీని కలిసే ఆలోచన ప్రస్తుతానికి లేదని కూడా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. కాగా, మరోవైపు కొన్ని రోజులుగానే బెంగళూరులోనే ఉన్న కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఢిల్లీకి మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ సమయంలో ఖర్గేతో పాటు శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లారు.

కాగా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదేండ్ల పదవీకాలంలో సగంకాలం పూర్తికావడంతో ముఖ్యమంత్రి మార్పుపై తీవ్రంగా ఊహాగానాలు సాగుతున్నాయి. 2023లో సిద్ధరామయ్య పదవీస్వీకారం చేసిన సమయంలోనే ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో రెండున్నరేండ్ల తర్వాత ముఖ్యమంత్రి మార్పు ఒప్పందం జరిగిందని ప్రచారం జరిగింది. దాని ప్రకారం ఈ నెల 20తో ఆ రెండున్నరేండ్ల గడువు ముగిసింది.

## రూ. 2,500 కోట్ల కొకైన్ కేసు మాస్టర్‌మైండ్ పవన్ ఠాకూర్ అరెస్ట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**



గత ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో పట్టుబడిన రూ.2,500 కోట్ల విలువైన 82 కిలోల హైగ్రేడ్ కొకైన్ కేసులో కీలక అభియోగం ఎదుర్కొంటున్న సూత్రధారి పవన్ ఠాకూర్‌ను దుబాయ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని త్వరలో భారత్‌కు అప్పగించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఠాకూర్ నడిపిన నెట్‌వర్క్ భారత్‌లోని పోర్టుల ద్వారా కొకైన్‌ను దిగుమతి చేసి, అక్కడి నుంచి ట్రక్కుల ద్వారా ఢిల్లీకి రవాణా చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. ఇటీవలి రూ. 282 కోట్లు విలువైన డ్రగ్స్ కేసులో కూడా పాత్ర. ఈ వారం ఢిల్లీలో పట్టుబడిన రూ. 282 కోట్ల విలువైన మెథాంఫెటమైన్ డ్రగ్స్ రవాణాకేసులో కూడా పవన్ ఠాకూర్ ప్రధాన పాత్ర ఉందని నార్కోటిక్ పోలీసులు తెలిపారు.

పవన్ ఠాకూర్ ఈ భారీ డ్రగ్స్ రవాణా ముఠాకు మాస్టర్‌మైండ్‌గా వ్యవహరిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. దేశంలోని పోర్టుల ద్వారా కొకైన్‌ను దిగుమతి చేసి, అక్కడి నుంచి ట్రక్కుల ద్వారా ఢిల్లీకి తరలించినట్టు తేలింది. దుబాయ్‌లో అతడి అరెస్ట్‌తో, భారత్‌కు అప్పగింపుపై కేంద్ర సంస్థలు సంబంధిత చట్టపరమైన ప్రక్రియలు వేగవంతం చేస్తున్నాయి. కేసులో మరిన్ని వివరాలు త్వరలో వెలుగు చూడనున్నాయి.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, 2047 విజన్ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి వరుస సమీక్షలు..

**బలగం టీవీ, హైదరాబాద్**



డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 కోసం ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవుతున్న ఈ అంతర్జాతీయ సదస్సుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే ఈ సదస్సుతో పాటు రాష్ట్రానికి అత్యంత కీలకమైన దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 (%వశ్రీఖఅస్త్రుఅఖ క్ష్మఱంఱఅస్త్ర% 2047) డాక్యుమెంట్ విడుదల చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ అంశాలపై వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ రోజు నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ అంశాలపై వరుస సమావేశాలను నిర్వహిస్తూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ, 2047 నాటికి తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించిన తెలంగాణ రైజింగ్ దార్శనిక పత్రంపై తుదిమెరుగులు దిద్దనున్నారు.

నవంబర్ 25న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ, నవంబర్ 26న లాజిస్టిక్స్, సమ్మిట్ ఏర్పాట్లు, నవంబర్ 27న మౌలిక వసతులు, అభివృద్ధి (పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ, రవాణా, రోడ్లు – భవనాలు, ఆర్థిక, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, మున్సిపల్ వ్యవహారాలు), నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమం, (క్రీడలు, నైపుణ్యత, టూరిజం, దేవాదాయ శాఖ), నవంబర్ 29న వ్యవసాయం, అనుబంధ విభాగాలు, సంక్షేమం (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ), నవంబర్ 30న ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమం. ఈ వరుస సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లతో పాటు అంశాల వారిగా జరిగే సమీక్షల్లో సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు.

# పోకిరిగా మారిన పోలీస్ కానిస్టేబుల్..

## మహిళను వేధించిన ఏఆర్ కానిస్టేబుల్ రిమాండ్‌కు..

**బలగం టీవీ, హైదరాబాద్**

పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు రక్షణగా ఉండాల్సిన ఓ కానిస్టేబుల్ పోకిరిగా మారాడు. హైదరాబాద్– మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్‌పై వెళ్తున్న అతను, రోడ్డు మీద నడుస్తున్న ఒక యువతిని అసభ్యంగా తాకిన సంఘటన కలకలం రేపింది. సమాచారం ప్రకారం, ఈ ఘటనపై బాధితురాలైన యువతి వెంటనే మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ అధికారులు దర్యాప్తు ప్రారంభించి, పోకిరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు పోలీస్ శాఖకు చెందిన ఏఆర్ (ఆర్మ్డ్ రిజర్వ్) కానిస్టేబుల్‌గా గుర్తించబడ్డాడు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ఉద్యోగి ఈ విధంగా చట్టాన్ని ఉల్లంఘించడంపై పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. విచారణ అనంతరం, పోలీసులు సదరు ఏఆర్ కానిస్టేబుల్‌ను రిమాండుకు తరలించారు. ఈ ఘటనపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.



# అల్మాస్‌పూర్‌లో మహమ్మాహి మాత దేవి వార్షికోత్సవం..

## అమ్మవారిని దర్శించుకున్న జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

అల్మాస్‌పూర్ గ్రామంలో మహమ్మాహి మాత దేవి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్యాక్స్ చైర్మన్, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తుల నుండి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేణుక కిషన్, మాజీ ఎంపిటిసి ఎల్లగందుల నరసింహులుతో పాటు మొగులోజి కిష్టయ్య, చంద్రయ్య, శీను, రవి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# సంగీతం శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ బోయినిపల్లి మండల నాయకులు

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమకమైన సంగీతం శ్రీనివాస్ ని మంగళవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఏనుగుల కనకయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు సంబ లక్ష్మీరాజం లు రాజన్న సిరిసిల్ల లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలబుకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- నంది వాగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే పెద్ద మొత్తంలో చేప పిల్లల పంపిణీ చేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం నందివాగు చెరువులో స్పీకర్ చేప పిల్లలను విడుదల చేశారు. అలాగే మండల కేంద్రంలోని రైతు వేదికలో 48 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతోపాటు దేవరంపల్లి, చక్రంపల్లి గ్రామాల్లో రూ.3 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడారు. మత్స్యకారుల కుటుంబాలు కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులను సరిగ్గా పట్టించుకోలేదని, చెరువుల్లో ఎన్ని చేపలను వదిలారో కూడా లెక్కలు లేవని తెలిపారు. జిల్లాలో కోటి 29 లక్షల చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్టు చెప్పారు. నందివాగు చెరువులో లక్షా 92 వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ప్రతి ఆడపడుచును గౌరవించుకునే విధంగా నాణ్యమైన చీరలను అందిస్తోందన్నారు. రహదారులకు ప్రాధాన్యత కల్పిస్తూ రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ ద్వారా రూ.554 కోట్లు, పంచాయతీరాజ్ ద్వారా రూ.160 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్టు వివరించారు. మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మెన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. మహిళా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ప్రతి మత్స్య సహకార సంఘంలోనూ 100మంది సభ్యత్వం కలిగి ఉండాలని సూచించారు. సభ్యులు అకాల మరణం చెందితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.7 లక్షల నష్టపరిహారం అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి, మండల ప్రత్యేక అధికారి సదానందం, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, మత్స్య శాఖ అధికారి రంగనాయక్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ సృజన సాహిత్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్‌యాదవ్, నందివాగు చెరువు చైర్మెన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో నిత్య పెళ్లికూతురు ఘరానా మోసం..

## 8.5 తులాల బంగారంతో పరారైన మహిళ

**బలగం టీవీ, వరంగల్**

వరంగల్ జిల్లాలో మాట్రిమోని ద్వారా పెళ్లి చేసుకొని, రూ. 4 లక్షల విలువైన వేడుకలు జరిపించుకుని, 8.5 తులాల బంగారంతో ఉడాయించిన మహిళపై కేసు నమోదైంది.



వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, చౌటపల్లి గ్రామానికి చెందిన మట్టపల్లి దేవేందర్ రావు (31) మ్యారేజ్ బ్యూరో ద్వారా నిమిషకవి ఇందిరా (30) అనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. దేవేందర్ రావు దాదాపు రూ. 4 లక్షలు ఖర్చు చేసి ఘనంగా వివాహ వేడుకలు జరిపించి, ఇందిరకు 8.5 తులాల బంగారం కానుకగా పెట్టిన వరుడు. పెళ్లయిన రెండు రోజులకే ఇందిరా ప్రవర్తనలో తేడా గమనించిన దేవేందర్ రావు ఆమె ఫోన్ తనిఖీ చేయగా, ఆమెకు ముందే పెళ్లయిందని, ఒక కూతురు కూడా ఉన్నట్టు గుర్తించాడు. దేవేందర్ రావు నిలదీయగా, ఇందిరా విడాకులు తీసుకున్నానని చెప్పి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసింది. ఈ విషయంపై ఇరువురి మధ్య గొడవ జరగగా, మరుసటి రోజు ఉదయం దేవేందర్ రావు మేల్కొనేసరికి ఇందిరా బంగారం, నగదుతో సహా ఇంటి నుంచి పారిపోయింది.

బాధితుడు మట్టపల్లి దేవేందర్ రావు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు, నిమిషకవి ఇందిరా మరియు ఆమె తల్లిపై పోలీసులకు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయించాడు. పోలీసులు విచారణ చేపట్టగా, ఇందిరా గతంలో కూడా ఇదే తరహాలో ఇద్దరు, ముగ్గురు యువకులను మోసం చేసినట్లు గుర్తించారు. ఈ 'కిలాడి లేడీ' కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.




# వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ శిబిరం..

**బలగం టీవీ, వేములవాడ**

కుటుంబ నియంత్రణ వారోత్సవాలలో భాగంగా ఈరోజు వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఉచిత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరము జరిగినది. ఇందులో మొత్తంగా 31 మంది మగవారికి కుటుంబ నియంత్రణ కోతకుట్టులేని ఆపరేషన్ లు జరిగినవి. ఈ శిబిరంలో వేములవాడ, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాలకు చెందిన ప్రజలు ఆపరేషన్లు చేయించుకున్నారు. ఇట్టి శిబిరంలో డాక్టర్లు పెంచలయ్య, రమేష్, సంపత్ కుమార్ మరియు దివ్యాలు పాల్గొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసిన మండల వైద్యులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పెంచలయ్య అభినందనలు తెలియజేశారు.

# మౌన నేస్తాలు..

**బలగం టీవీ, ఆలేరు**



భగ భగ మండుటెండలో జడువక మనకు,చల్లని నీడతో స్వాగతమిచ్చె చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు, బడిపిల్లలకు బెంచిలై, బడిపంతులకు కుర్చీలై, ప్రేమతో వారిని బరువనక మోసేచెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని, మొక్కలను నాటు నాటించు,వృద్ధాప్యములో పెద్దకొడుకు వోలే చేతికర్రై సేవలందించే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని, మొక్కలను నాటు నాటించు, దివ్య ఔషధాలు అందించి మహమ్మారి జబ్బులను నయం చేసే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు, విందు వినోదాల్లో మధుర ఫలాలు అందించి నీకు పేరు ప్రఖ్యాతలు తీసుకవచ్చే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు, సకాలంలో వర్షాలు అందించి రైతన్నల పాలిట కల్పవృక్షమైనిలిచే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు, మన పుట్టుక నుండి గిట్టేవరకు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటు మన మనుగడకు జీవనాధారం నిలిచే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు..

**- రచన మంజుల పత్తిపాటి, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్**

# రాజన్న ఆలయ విస్తరణ పనులు పరిశీలన



- మూలవాగు పై బ్రిడ్జి నిర్మాణ పనులు, ప్రధాన రహదారి విస్తరణ, డబుల్ బెడ్ రూం నిర్మాణాలను పరిశీలన
- ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- అధికారులకు సూచనలు
- భీమేశ్వర ఆలయంలో పూజలు, కోడె మొక్కులు చెల్లింపు

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆలయ దక్షిణ భాగంలో భారీ యంత్రాలతో చేస్తున్న పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

అంతకు ముందు వేములవాడ ఆర్టీసీ డిపో సమీపంలోని నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మిస్తున్నారు? ఎప్పటి వరకు పూర్తి చేస్తారో ఆరా తీశారు. మొత్తం రూ. 5 కోట్ల 61 లక్షల వ్యయంతో 144 ఇండ్లు నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు.

అక్కడి నుంచి నేరుగా మూలవాగుపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి పనులను, వేములవాడ ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బస్ స్టాండ్ వరకు నిర్మిస్తున్న రోడ్డు, డ్రైనేజ్ పనులను పరిశీలించారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. షవర్లు, కళ్యాణకట్ట, క్యూ లైన్లు పరిశీలించి, ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ అధికారులకు విప్, ఇంచార్జి కలెక్టర్ సూచనలు చేశారు.

**భీమేశ్వర ఆలయంలో పూజలు**

భీమేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా విప్, ఇంచార్జి కలెక్టర్ కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ ను ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.



# బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు

- గడిచిన ఏడు నెలల్లో 3740 మందిపై కేసులు నమోదు
- 10,980 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, మద్యం సేవించి వాహనాలు నడుపుతే జరిమానాలు, జైలు శిక్షలు తప్పవు. జిల్లాలో ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా ఉంచడం జరిగింది. దీనిలో భాగంగా గడిచిన ఏడు నెలల్లో 3740 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నిఘాలో భాగంగా, ముఖ్యంగా రాత్రి సమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, పెట్రోలింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పెట్రో కార్స్, బ్లూ కోల్ట్ సిబ్బంది ఈ ప్రాంతాలపై నిఘా కఠినతరం చేయనున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పరిధిలో ప్రతిరోజూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. గడిచిన ఏడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 10,980 మంది పట్టుబడ్డారు. వారికి జరిమానాలు విధించగా, 260 మందికి జైలు శిక్షలు విధించడం జరిగిందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయడానికి సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటుగా, మద్యం సేవించి పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ప్రజలలో చైతన్యం కల్పిస్తున్నామన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు.

# చలి తీవ్రత దృష్ట్యా పేద విద్యార్థుల పట్ల కేటీఆర్ కనికరం

**గిఫ్ట్ ఏ స్మైల్ లో కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట, గాలిపల్లి ప్రభుత్వ హాస్టల్లో దుప్పట్లు పంపిణీ**



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామంలో ని బీసీ హాస్టల్ లో, ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్లో పేద విద్యార్థిని, విద్యార్థులు చలికి పడుతున్న ఇబ్బందులకు చలించిన మాజీ మంత్రి, ప్రస్తుత సిరిసిల్లా శాసన సభ్యులు కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా మానకొండూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నేతలతో దుప్పట్ల పంపిణి చేశారు.

అనంతరం రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. మానకొండూర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు దుప్పట్లు ప్లేట్ గ్లాసులు అందించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండి కాలయాపన చేస్తుందని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు చన్నీళ్ల స్నానాలతో వణుకుతున్నారని, పలు హాస్టళ్లలో నేలపైనే పడుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు నేలపైన పడుకోవడం వలన పాముకాటు గురవుతున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు స్థానిక శాసన సభ్యులు మానకొండూర్ నియోజకవర్గం లోని అన్ని హాస్టల్లను సందర్శించి.. విద్యార్థిని విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. అనంతరం ఇల్లంతకుంట మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న వివిధ కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బిఆర్ఎస్ పార్టీ ఇల్లంతకుంట మండల అధ్యక్షులు పల్లె నరసింహారెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో కానిస్టేబుళ్ల బదిలీలు

- ఎస్పీ మహేష్ బి. గీతే ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసు శాఖలో భాగంగా పలువురు కానిస్టేబుళ్లకు సోమవారం (నవంబర్ 24, 2025) బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఈ బదిలీల ప్రక్రియను చేపడుతూ అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు.



# వరి కొయ్యకాలు కాల్చవద్దు..

- వరి కొయ్యకాలకు నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోవడంతో పాటు దిగుబడి తగ్గుతుంది
- జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం
- మండల వ్యవసాయ అధికారిని ప్రణీత

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం, మండల వ్యవసాయాధికారిని ప్రణీత, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రవళి, ZREC సభ్యులు పులి లక్ష్మి పతి, రైతులు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో ముసాయిదా విత్తన బిల్లు 2025 పై అవగాహన మరియు రైతుల అభిప్రాయ సేకరణ తీసుకోవడం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం రైతులతో మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక ప్రమాదాలు సంభవించడమే కాకుండా ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని,వరి కొయ్యకాలకు నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోవడంతో పాటు దిగుబడి తగ్గుతుందని, అలాగే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. వరి కొయ్యలను పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుంది. తద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చని రైతులకు సూచించారు. వరికొయ్యలను (కొయ్యకాలు) కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడి పోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# హాలో కళాకారులు.. చలో కరీంనగర్..

- కరీంనగర్ కళాభారతిలో ఈనెల 28న తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ రాష్ట్ర సదస్సు
- తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య
- సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ రాష్ట్ర సదస్సు ఈ నెల 28న కరీంనగర్‌లోని కళాభారతిలో జరగనుంది. ఈ సదస్సు పోస్టర్‌ను మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ప్రముఖ సంఘ సేవకులు, రాష్ట్ర గవర్నర్ చే సిల్వర్ గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య మాట్లాడుతూ.. ఈనెల 28న కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు సకల వృత్తి కళాకారులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా రాష్ట్రంలో ఉన్న ఎంతోమంది సకల వృత్తి కళాకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధ కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో జరిగే బోనాల పండుగ, బతుకమ్మ వేడుకలకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారులకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 28న కరీంనగర్ లోని కళాభారతిలో రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేస్తున్నామని అధిక సంఖ్యలో జానపద సకల వృత్తి కళాకారులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దాట్ల నిర్మల, కోశాధికారి ఎద్దు మమత, సీనియర్ కళాకారులు ఎటుమల శ్రీధర్ రెడ్డి, ప్రముఖ సామాజికవేత్త వేముల మార్కండేయ, గూడూరు శ్రీకాంత్, బండారి సంతోష్, తెలంగాణ జానపద సిరిసిల్ల డివిజన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ లక్ష్యం 549

- **లక్ష్య ఛేదనలో 27 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన టీమిండియా**

**బలగం టీవీ, హైదరాబాద్**

స్వదేశంలో టీమ్ఇండియా మరో భారీ టెస్ట్ సిరీస్ వైట్‌వాష్ వైపు దూసుకెళ్తోంది. ఏడాది క్రితం న్యూజిలాండ్ ఇచ్చిన షాక్ నుంచి ఇంకా కోలుకోని భారత జట్టుకు, ప్రస్తుత వరల్డ్ టెస్ట్ చాంపియన్లు దక్షిణాఫ్రికా మరోసారి అదే దెబ్బ ఇవ్వడానికి సిద్ధమైంది. నాలుగో రోజుతో భారత జట్టు అన్ని విభాగాల్లోనూ విఫలమవడంతో సఫారీలు 549 పరుగుల రికార్డు లక్ష్యాన్ని విధించారు.నాలుగో రోజు ముగిసే సమయానికి భారత్ 27/2తో కష్టాల్లో పడింది. ఐదో రోజు విజయానికి 522 పరుగులు చేయాల్సివుండగా, దక్షిణాఫ్రికాకు 8 వికెట్లు తీస్తే సరిపోతుంది. ఈ మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌ను డ్రా చేసే అవకాశం చాలా దూరంగా ఉన్నప్పటికీ, డ్రా చేసినా పెద్ద అద్భుతం చేసినట్టే.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌ను 260/5 వద్ద డిక్లేర్డ్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి భారత్ ఎదుట 549 పరుగుల భీకర లక్ష్యాన్ని నిలిపింది.ట్రిస్టన్ స్టబ్స్ (94బీ 180 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) శతకాన్ని త్రుటిలో కోల్పోయినా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జోర్జి (49) అతనికి అండగా నిలిచాడు.



ఉదయం సెషన్‌లో మూడు వికెట్లు త్వరగా కోల్పోయిన సఫారీలు కాస్త తడబడినప్పటికీ, స్టబ్స్ ఒంటి బలంతో జట్టును నిలబెట్టాడు. జడేజా 4/62తో భారత బౌలర్లలో మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు.

భారత జట్టు రెండో ఇన్నింగ్స్ కూడా నిరాశపరిచింది. 21 పరుగులకే ఓపెనర్లిద్దరూ పెవిలియన్ చేరారు.జైస్వాల్ (13) %-% యాన్సెన్ బౌలింగ్‌లో వెరీన్‌కు క్యాచ్‌కెఎల్ రాహుల్ (6) %-% హర్మర్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ ఇలా భారత్ ఐదో రోజు భారీ ఒత్తిడిలో ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దక్షిణాఫ్రికా 1వ ఇన్నింగ్స్: 489
భారత్ 1వ ఇన్నింగ్స్: 201
దక్షిణాఫ్రికా 2వ ఇన్నింగ్స్: 260/5 డిక్లేర్డ్ (78.3 ఓవర్లు)
భారత్ 2వ ఇన్నింగ్స్: 27/2 (15.5 ఓవర్లు)

**అంతర్జాతీయ పెట్టుబడులకు హబ్‌గా**

# హైదరాబాద్‌ను నిలబెట్టేలా గ్లోబల్ సమ్మిట్ సాగాలి

- **సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ నిలిచేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిలవాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అన్నారు. పెట్టుబడిదారులకు సంబంధించి అనుకూల అంశాలతో పాటు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సమ్మిట్ లో సమగ్రంగా వివరించాలని చెప్పారు.డిసెంబరు 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న సమ్మిట్‌కు సంబంధించి బ్రాండింగ్‌పై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి వివిధ సంస్థలు రూపొందించిన ప్రచార చిత్రాలు, వీడియోలను వీక్షించి పలు మార్పులు చేర్పులు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో విభాగాల వారీగా మనం చేపట్టే పనులకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రచారంలో ప్రముఖంగా ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. పెట్టుబడిదారులకు హైదరాబాద్‌కు అనుకూలాంశాలైన ఇన్నర్ రింగు రోడ్డు, అవుటర్ రింగు రోడ్డు, రానున్న రీజినల్ రింగు రోడ్డు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైలు మార్గం, డ్రైపోర్ట్ తో పాటు తెలంగాణలోని కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతను వివరించాలని ముఖ్యమంత్రి గారు తెలిపారు.

రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేని అంశాన్ని, పెట్టుబడుల విషయంలో మద్దతుగా నిలుస్తున్న విషయాన్ని బలంగా నొక్కి చెప్పాలని సూచించారు.తెలంగాణ బ్రాండింగ్‌కు సంబంధించి మన రాష్ట్రానికే పరిమితమైన, వైవిధ్యమైన రామప్ప ఆలయంలోని నంది, సమ్మక్క సారక్క జాతర, నల్లమల్ల పులులు, మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రత్యేకమైన ఎద్దులు, తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాలను శాసించిన పి.వి.నరసింహారావు వంటి ప్రముఖులు, కళాకారులు, క్రీడాకారులు, అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు ఇలా ప్రతి ఒక్కదానికి బ్రాండింగ్‌లో చోటు కల్పించాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ వేదికలను బ్రాండింగ్‌కు సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు.

# పంచాయతీ ఎన్నికలకు మోగిన నగరా

**(మొదటి పేజీ తరువాయి)**

తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల జీపీ మహేశ్‌భగవత్,, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు. బీసీ సర్పంచ్ స్థానాలు ఈ సారి తగ్గినట్టు తెలుస్తోంది. జిల్లాల వారీగా ఎన్నికల అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించి ప్రభుత్వానికి సమర్పించినా,పంచాయతీరాజ్ శాఖ గాని ఎన్నికల సంఘం గాని రాష్ట్ర వ్యాపిత రిజర్వేషన్ల తుది జాబితాను ప్రకటించలేదు. బీసీ సంఘాలు, ఇతర వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం రోటేషన్ పేరుతో రిజర్వేషన్ల ఖరారుతో బీసీలకు అన్యాయం జరిగిందని సమాచారం. 2019లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల కంటే ప్రస్తుతం 2025లో జరిగే ఎన్నికల్లో 600 సీట్లు తగ్గినట్టు తెలు స్తోంది. గతంలో 23శాతం బీసీలకు దక్కగా ఈసారి 18 శాతానికి పడి పోయినట్టు గణాంకాలు చెబుతున్నా యి. 30 మండలాల్లో ఒక్క గ్రామం కూడా బీసీలకు దక్క లేదనీ, 80 మండలాల్లో ఒకటి నుంచి రెండు గ్రామాలు మాత్రమే బీసీలకు దక్కా యని తెలుస్తోంది. రెండు రోజుల్లో రిజర్వేషన్ల పూర్తి వివరాలు తెలుస్తా యని భావిస్తున్నారు.




# ఆస్కార్ బరిలో 'మహావతార్ నరసింహ'

**భారత యానిమేషన్‌కు ప్రపంచ వేదికపై అరుదైన గౌరవం**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారతీయ యానిమేషన్ రంగానికి అరుదైన గుర్తింపును తెచ్చిపెడుతూ, విజువల్ వండర్‌గా నిలిచిన 'మహావతార్ నరసింహ' చిత్రం అంతర్జాతీయ వేదికపై సంచలనాన్ని సృష్టించింది. ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్స్ 2026)లో ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీకి అర్హత సాధించిన చిత్రాల జాబితాలో ఇది చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 35 మేటి యానిమేషన్ చిత్రాలతో కలిసి పోటీ పడే అవకాశం దక్కడం భారతీయ చిత్రరంగానికి ప్రత్యేక గౌరవంగా నిలిచింది.

క్లీమ్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో, హొంబలే ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. భారతీయ పురాణ గాథకు హాలీవుడ్ స్థాయి సాంకేతిక నైపుణ్యాన్ని జతచేసి దర్శకుడు అశ్విన్ కుమార్ అద్భుతంగా మలిచిన ఈ చిత్రానికి ఇప్పుడు ఆస్కార్ రేసులో స్థానం దక్కడం పరిశ్రమను మరింత ఉత్సాహపరుస్తోంది. ఈ రేసులో 'మహావతార్ నరసింహ'.. డిస్నీ వారి 'జూటోపియా 2', 'కే పాప్ డెమన్ హంటర్స్', జపాన్‌కు చెందిన 'డెమన్ స్లేయర్: కిమెత్సు నో యాబా %-% ఇన్ఫినిటీ కాజిల్', 'స్కార్లెట్' వంటి ప్రపంచ ప్రఖ్యాత యానిమేషన్ చిత్రాలతో పోటీపడనుంది.

'మహావతార్ నరసింహ' దర్శకుడు అశ్విన్ కుమార్‌కు ఇది తొలి చిత్రం కావడం విశేషం. చిన్నతనం నుంచి హాలీవుడ్ యాక్షన్ చిత్రాలు, జపనీస్ యానిమే సిరీస్‌లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని ఆయన తెలిపారు. ది హాలీవుడ్ రిపోర్టర్‌తో మాట్లాడుతూ, "'టెర్మినేటర్', 'జురాసిక్ పార్క్', 'అవతార్' వంటి హాలీవుడ్ చిత్రాలు, అలాగే మహాభారతం వంటి మన పురాణ గాథలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ స్ఫూర్తితోనే భారతీయ కథను అంతర్జాతీయ స్థాయిలో చెప్పాలనుకున్నాను. నేను యానిమేలకు పెద్ద అభిమానిని. నా బాల్య స్మృతులు, నేను చూసిన సినిమాల ప్రభావమే ఈ చిత్రం" అని వివరించారు.

98వ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవం 2026 మార్చి 15న జరగనుంది. ఈ కార్యక్రమం ఏబీసీ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా 35 చిత్రాలు పోటీ పడుతున్న ఈ కేటగిరీలో భారతీయ చిత్రం షార్ట్‌లిస్ట్ కావడం ఒక చారిత్రక మైలురాయి. ప్రస్తుతం ఈ చిత్రం ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో వీక్షకుల కోసం అందుబాటులో ఉంది. ఈ అద్భుతమైన విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ యానిమేషన్ చిత్రాలకు అంతర్జాతీయ ద్వారాలు తెరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు విలీనం

**(మొదటి పేజీ తరువాయి)**

విని యోగాన్ని పెంచాలని నిర్ణయించారు. దానిలో భాగంగా మరో మూడువేల మెగావాట్ల సోలార్ పవర్ కొనుగోలు, రెండు వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోళ్లకు ఐదేండ్ల కాల పరి మితితో టెండర్లు పిలవాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమో దం తెలిపింది. రాష్ట్రంలో పలుచోట్ల పంప్డ్‌స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయనీ, దాదాపు 10వేల మెగావాట్ల వరకు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతులు ఇచ్చేందుకు మంత్రి వర్గం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే డిస్కంల వద్ద ఇప్పటికే ఉన్న ఒప్పందాలను కూడా పరిశీలించాలని సూచించారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కంలకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

రాష్ట్రానికి కొత్తగా వచ్చే పరిశ్రమలకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా, వాటికి అవసరమైన విద్యుత్‌ను క్యాప్టివ్ పద్ధతిలో వారే ఉత్పత్తి చేసుకొనే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇలాంటి దరఖా స్తులకు వెంటనే ఆమోదం ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే విద్యుదుత్పత్తి గరిష్ట సామర్థ్యానికి కూడా ఎలాంటి పరిమితులు లేవని మంత్రివర్గం స్పష్టం చేసింది. అయితే ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు మాత్రం ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ (ఆర్టీసీఎస్)లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టా లని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పాల్వంచ, మక్తల్ లోనూ పిట్‌హెడ్‌లుగా ఎన్టీపీసీ, టీజీజెన్‌కో నుంచి ప్రతిపాదనలు స్వీకరించి యూనిట్ విద్యుత్ రేటు ఆధారంగా తుది పరిశీలన చేయాలని నిర్ణయించారు.

హైదరాబాద్‌లో రూ.14 వేల 725 కోట్ల అంచనా వ్యయం తో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనిపై ఇప్పటికే బెంగుళూరులో ఇంధన శాఖ అధికారులు అధ్యయనంచేసి వచ్చారనీ, దాని ప్రకారమే జీహెచ్ఎంసీ పరిధిలో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీని అమలు కోసం హైదరాబాద్ సిటీని మూడు విద్యుత్ సర్కిళ్లుగా విభజించుకొని పనుల్ని చేపడతారు. ఈ ప్రాజెక్ట్‌లోనే టీ ఆప్టిక్‌ఫైబర్ సహా అన్ని రకాల కేబుల్ నెట్వర్క్ వైర్లన్నింటినీ అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా చేసేందుకు ఆయా కంపెనీలతో సంప్రదింపులు జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. దానికి అవసరమైన వర్కింగ్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటి గ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభు త్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయింపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానితో పాటు ఇప్పుడున్న 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చాలనీ, కొత్త గా 6ఏటీసీల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో అమల్లోకి తెచ్చిన పారిశ్రామిక వాడల జోన్‌ల మార్పుపై బీఆర్ఎస్‌పార్టీ చేస్తున్న ఆరోపణలు, విమర్శల్ని మంత్రులు తిప్పికొట్టారు. ఈ విధాన నిర్ణయంలో ఎలాంటి అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని విమర్శించారు.